క్లుప్తంగా

18న లోక్ అదాలత్



సదస్సులో మాట్లాడుతున్న జడ్జిలు

పాలకొల్లు సెంట్రల్: న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఉషా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఫ్యామిలీ, కన్స్యూమర్స్, ఐపీఆర్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి, ఏపీపీ జయసింధు, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

వీధి దీపాల కోసం వినతి



పెనుగొండ పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: పంచాయతీ పరిధిలోని కోడి పందేల దిబ్బలో విద్యుత్ దీపాలు సదుపాయం కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం పెనుగొండ పంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేశారు. కాలనీ ఏర్పడి 14 ఏళ్లు దాటుతున్నా మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించలేదని, వీధిలైట్లు లేక రాత్రి వేళల్లో నానావస్థలు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు ఎం నాగేశ్వరరావు, గెద్దాడ శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

జిల్లా అధికారులే సర్వే చేయాలని ఫిర్యాదు

మొగల్తూరు: కాళీపట్నం రెవెన్యూ గ్రామాల్లోని మేట భూములను కృష్ణా జిల్లా అధికారులతో కాకుండా మన జిల్లా అధికారులతోనే సర్వే చేయించాలని స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సన్న, చిన్న కారు రైతుల సంఘం అధ్యక్షుడు తణుకుల నాగేశ్వరరావు తెలిపారు. కాళీపట్నం గ్రామంలోని 327 సర్వే నెంబర్‌లో గల భూములను సర్వే చేసి మిగులు భూములను పేదలకు పంచాలని జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్‌లకు వినతి పత్రాలు అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు తణుకుల వెంకన్న, నరసింహులు, కవురు పెద్దిరాజు, సత్తినేని పెద్దిరాజు, రంగిశెట్టి శ్రీరాములు, బాలం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

వీరవాసరం: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అడిషనల్ ఎస్పీ ఎ.సుబ్బరాజు సూచించారు. నౌడూరు జంక్షన్‌లో సోమవారం వాహనచోదలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. తోటి వాహనచోదకులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వాహనాన్ని నడపాలన్నారు. హెల్మెట్ వాడకం వల్ల ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవించకుండా రక్షణ కల్పించుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎస్సై పి.రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పండ్ల పంపిణీ



కలసిపూడిలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న దృశ్యం

ఉండి: పెద్దలను ఆదర్శంగా తీసుకుని సేవాకార్యక్రమాలను నిర్వహించాలని ఎస్సై కే గంగాధరరావు అన్నారు. సోమవారం కలిసిపూడిలో రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి కేశబోయిన కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివప్రసాద్ ఆర్థిక సహకారంతో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కానుబోయిన వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బోయిన శ్రీను, బాతు మోషేన్‌రాజు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

పాలకోడేరు: మోగల్లులో పేకాట శిబిరంపై సోమవారం దాడి చేసి 12 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పారదర్శకంగా సీఎం జగన్ పాలన



ఆచంటలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పేదలకు సంక్షేమాన్ని అందించడానికి నాడు జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తేగాని అందేదికాదని, నేడు పార్టీలకతీతం అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమం అందుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వంలో పేదలకు అందించిన సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇతర సీఎంలు అనుసరిస్తున్నారని వివరించారు. సంక్షేమానికి, అభివృద్ధికి లక్షల కోట్లు వ్యయం చేశారని తెలిపారు. దీంతో ఉనికిని కోల్పోతామన్న భయంతో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలను మభ్య పెట్టడానికి నిత్యం ప్రయత్నిస్తున్నారన్నారు. నిన్న మొన్నటి వరకు సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించిన చంద్రబాబు నేడు మాట మార్చి సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తానని సీఎం జగన్ బాటలోకి వచ్చారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాటకు ఎన్ని అడ్డంకులు వచ్చినా అమలు చేస్తూ ముందుకుసాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, ఉప సర్పంచ్ అడ్డాల పెద్దిరాజు, నిమ్మన సత్యనారాయణ, వేమన అప్పారావు, అడ్డాల ప్రసాద్, పెచ్చెట్టి శ్రీను, మానేపల్లి సూర్యకుమారి, వేమన గాంధీ,అరిగెల సురేష్,నంబూరి రాజా, మొల్లేటి రామకృష్ణ, కడలి నారాయణ ప్రసాద్, మేడిచర్ల పండులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మామిడి పూత

నరసాపురం రూరల్: వాతావరణం అనుకూలించడంతో ఈ సీజన్‌లో మామిడి తోటల్లో పూత ఆశాజనకంగా ఉంది. గతేడాది ధర బాగున్నప్పటికీ మామిడి దిగుబడి తక్కువగా ఉండడంతో ఆశించిన స్థాయిలో వ్యాపారాలు సాగలేదు. ఈ ఏడాదైనా తేనెమంచు కురవకుండా ఉంటే పూత పిందె దశకు చేరుకుంటుందని రైతులు ఆశిస్తున్నారు. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 250 హెక్టార్లకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. ఇందులో హైబ్రిడ్ చెట్లు మొదలుకుని కొన్ని తోటల్లో పదేళ్లకు పైగా వయసున్న చెట్లు పూతతో దర్శనమిస్తున్నాయి. పూతను నిలుపు కునేందుకు రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పూత ఎక్కువగా ఉండటంతో తోటలను లీజు తీసుకునేందుకు రైతులు, వ్యాపారులు ముందుకొస్తున్నారు. మరో నెల రోజులపాటు మంచు కురవకుండా ఉంటే పూత నిలచి పిందవుతుందని రైతులు చెబుతున్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం



చింతపర్రులో భూ సర్వేలో డ్రోన్‌ను ఎగరవేయడానికి సిద్ధం చేస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొల్లు అర్బన్: భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి జగనన్న సమగ్ర భూ సర్వే ఉపయోగపడుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ కట్టా పూరిమ నాగదేవి అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రులో జగనన్న సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో భాగంగా డ్రోన్ ఫ్లయింగ్‌ని ఆమె మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాలకొల్లు మండలంలోని 15 రెవెన్యూ గ్రామాలకు ఆగర్రు, వెలివెల, దిగమర్రు, పెదమామిడిపల్లి, చందపర్రు, గోరింటాడ గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. లంకలకోడేరు, దగ్గులూరు, చింతపర్రు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి, పాలమూరు, ఉల్లంపర్రు, అరట్లకట్ట గ్రామాల్లో సర్వే పురోగతిలో ఉందని చెప్పారు. ఈ సర్వే బుధవారంతో ముగియనుందన్నారు. అనంతరం డ్రోన్ ఇచ్చిన సర్వే మాప్‌ల ఆధారంగా రెవెన్యూ రికార్డులు పరిశీలించి రైతుల భూముల రికార్డులను సరిజేయనున్నట్టు తెలిపారు. వందేళ్ల నాటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సర్వేయర్లు సీహెచ్ రవిరాజు, భద్రరాజు, వీఆర్వో మండెల నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి షేక్ సులేమాన్, సచివాలయ కార్యదర్శి లోకేష్, సచివాలయ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ల అందజేత



తిల్లపూడిలో దివ్యాంగులకు పింఛన్లు అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: తిల్లపూడి గ్రామదేవతలు తిల్లపాయిలమ్మ, మారెమ్మవార్ల హుండీ ఆదాయం నుంచి గ్రామంలోని పేద దివ్యాంగ విద్యార్థులకు పింఛన్లు అందజేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ నడపన శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో గ్రామంలోని 10 మంది పేద దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. ప్రతి నెలా ఈ పింఛన్లు అందజేయనున్నట్టు చెప్పారు. హుండీ నుంచి లభించే ఆదాయాన్ని ప్రతి నెలా లబ్ధిదారుల సంఖ్య పెంచుతామని, అవసరమైతే గ్రామేతరులకు ఈ పింఛన్లు అందజేయాలని నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత కామిశెట్టి స్వామి అయ్యప్ప నాయుడు, నడపన తాతాజీ, ఈవన సతీష్, నడపన పురుషోత్తం, నడపన బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత



వినిస్టన్‌బాబుని సత్కరిస్తున్న పూలపల్లి వైఎస్సార్ సీపీ యూత్

పాలకొల్లు అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత లభిస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. పూలపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం వినిస్టన్‌బాబును ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ యువజనులు సత్కరించారు. ఈ సందర్భంగా వినిస్టన్‌బాబు మాట్లాడుతూ ఎస్సీనైన తనకు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడుగా నియమించిన సీఎం జగన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వినిస్టన్‌బాబును సత్కరించిన వారిలో యువజన నాయకులు పాలపర్తి శాంతరాజ్, కోటి రమేష్, పానుకు దైవకృప, పాలపర్తి అజయ్, బొందా పార్థసారథి, మద్రె నాగరాజు, బొంద రవి, కొయ్యే వందన్‌కుమార్, బొందా ఓంకార్, కుంచే ప్రవీణ్‌కుమార్, చింతపల్లి విజయ్, వంశీ, బూసి నాని, నక్కా రాజు, జాలెం నరేష్, బొమ్మి సందీప్, గొల్లపల్లి సునీల్‌కుమార్, కోటి విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

1 నుంచి తిల్లపాయిలమ్మ, మారెమ్మల జాతర



తిల్లపాయిలమ్మ



మారెమ్మ

పాలకొల్లు అర్బన్: మండలంలోని తిల్లపూడి గ్రామ దేవతలు తిల్లపాయిలమ్మ, మారెమ్మవార్ల జాతర ఉత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి మార్చి 9 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు కామిశెట్టి అయ్యప్పనాయుడు, గ్రామ సర్పంచ్ నడపన శ్రీనివాసరావు, నడపన తాతాజీ, ఈవన సతీష్ తెలిపారు. మార్చి 1న రాత్రి అమ్మవార్ల జాతర, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తామని వివరించారు. 2న శాస్త్రి ఆర్కెస్ట్రా, 3న డాన్స్ బేబీ డాన్స్, మార్చి 4న క్లాసికల్ డాన్స్, మార్చి 5న రాక్ స్టార్ తాడేపల్లిగూడెం వారి డాన్స్ ప్రోగ్రాం, మార్చి 6న రంగస్థల ఆణిముత్యాలు, మార్చి 7న శ్రీదేవీ డ్రామా కంపెనీ సాంస్కృతిక కార్యక్రమం, మార్చి 8న సత్య ఆర్కెస్ట్రా, జబర్దస్త్ నటీనటుల హంగామా, మార్చి 9న అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

దేశం గర్వించదగిన శాస్త్రవేత్త రామన్



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: భారతదేశం గర్వించదగిన గొప్ప భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ అని ఎంఈఓ ఏఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 1930లో నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి భారత భౌతిక శాస్త్రజ్ఞుడు సీవీ రామన్ అని అన్నారు. 1986 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు విజేతలకు బహుమతులు అందజేశారు. లయన్స్ రీజనల్ సెక్రటరీ డాక్టర్ ఎస్వీ రంగారావు, ఎంఎస్ కోఆర్డినేటర్ తోకల జనార్దన్, నిట్టల శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం పునఃప్రతిష్ఠాపన ప్రారంభం

అలరించిన గజల్ శ్రీనివాస్ గానం



అనంత్ శ్రీరామ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ, సబ్‌కలెక్టర్ తదితరులు

నరసాపురం: స్థానిక కుమ్మరివీధి ప్రసిద్ధ కోదండ రామాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, శిరీష దంపతులచే పెద్దింటి అనిల్‌కుమార్ సిద్ధాంతి ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం గోవు మంగళ వాయిద్యాలతో వేద మంత్ర సహిత గ్రామ ప్రదక్షిణ చేశారు. అఖండ దీపారాధన, ఖల్మషహోమం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి గజల్ శ్రీనివాస్ గజల్స్ అలరించాయి. సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ రామగేయ గానాన్ని అలపించారు. గజల్ శ్రీనివాస్, అనంత శ్రీరామ్‌లను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. విశిష్ట అతిథిగా సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చేగొండి రామకృష్ణ జమిందార్, పాలంకి వరప్రసాద్, కోటిపల్లి నందరావు, నంద్యాల బాబు, అధికారి సతీష్, గుడివాబ ప్రభాకర్ పాల్గొన్నారు.

అధ్వానంగా మొగల్తూరు కాలువ



మొగల్తూరు ప్రధాన కాలువలో ఎండిన గుర్రపు డెక్క

మొగల్తూరు: నిడదవోలు, నరసాపురం ప్రధాన కాలువ మొగల్తూరు లాకు వరుకు ప్రవహిస్తుంది. ఈ కాలువ నుంచి రెండు భారీ మంచినీటి చెరువులకు తాగు నీరు, వేలాది ఎకరాలకు సాగు నీరందుతుంది. ఈ కాలువలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే చెత్త, చెదారాలు, గుర్రపుడెక్క, జంతు కలేబరాలు రోజులు తరబడి నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. స్థానిక జంగిల్ చానల్ నుంచి కేపీపాలెం భారీ మంచి నీటి చెరువును ఇదే నీటితో నింపుతారు. జంగిల్ చానల్ వద్ద భారీగా ఎండిపోయిన గుర్రపు డెక్కతో పాటు చెత్త, చెదారాలు నిలిచిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్త, చెదారాలను తొలగించాలని అధికారులను పలువురు కోరుతున్నారు.

పాలకొల్లు లయన్స్ క్లబ్‌కు అవార్డులు



అవార్డులతో లయన్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు లయన్స్ క్లబ్‌కు 23 రీజినల్ అవార్డులు వచ్చినట్టు క్లబ్ అధ్యక్షుడు ముచ్చర్ల వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక సీహెచ్ సత్యవతి మెమోరియల్ లయన్స్ కమ్యూనిటీ హాలులో రీజినల్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ లయన్స్ క్లబ్‌కు రీజియన్ బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్‌లతో పాటు వివిధ అంశాల్లో మొత్తం 23 రీజినల్ అవార్డులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు చేతులు మీదుగా అందుకున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, కారుమూరి రామలింగేశ్వరరావు, చల్లా ఆదినారాయణమూర్తి, మాఘం శ్రీనివాసరావు, కట్టా రామకృష్ణ, శ్రీకాకొల్లు కామేశ్వరరావు, తటవర్తి కృష్ణమూర్తి, పీఎన్‌డీ వరప్రసాద్, అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ జామి హైమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలోని అంశాలపై సమావేశంలో చర్చిస్తామని, సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.


'మధ్యాహ్న' నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దు



కోపల్లె పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎండీఎం కోఆర్డినేటర్ కృష్ణారావు

కాళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజన పథకం) నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎండీఎం కో-ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. కోపల్లె, వేంపాడు ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకానికి ఉపయోగించే వంటనూనె, కూరగాయలు, చిక్కీలు, వంటి ఇతర పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ద్వారా వచ్చే తాగునీరు, విద్యార్థులు ఉపయోగించే టాయిలెట్స్, పారిశుధ్య నిర్వహణ, రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరైన విద్య అందాలంటే నాణ్యమైన పోషకాహారం అవసరమన్నారు. పోషక విలువలు కూడిన ఆహారంతో పాటు గుడ్లు, చిక్కీలు, పోర్టిఫైడ్ బియ్యం ప్రభుత్వం అందిస్తోందన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు రుచికరంగా వండి వడ్డించాలని సూచించారు. హెచ్ఎం సుభాషిణి, శివమాధవి, సీఆర్పీ పుష్పరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న సైన్స్ ముగ్గులు



మేడపాడులో హైస్కూల్ విద్యార్థులు వేసిన గుండె చిత్ర పటం



మేడపాడులో హైస్కూల్ విద్యార్థులు వేసిన మానవ శరీరం



మేడపాడులో హైస్కూల్ విద్యార్థులు వేసిన భూమి

యలమంచిలి: ప్రోత్సాహం ఉంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లోను అమోఘమైన ప్రతిభ ఉంటుందని మేడపాడు హైస్కూల్ విద్యార్థులు నిరూపించారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం మేడపాడు హైస్కూల్లో 9, 10వ తరగతి విద్యార్థులు 34 మంది సైన్స్ డయాగ్రామ్స్ ముగ్గులు వేశారు. గుండె, మానవ శరీర నిర్మాణం, భూమి, రక్త ప్రసరణ వ్యవస్థ, విద్యుత్ విశ్లేషణ, నీటి విద్యుత్ విశ్లేషణ, గ్లోబల్ వార్మింగ్, సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి భూమిని ఓజోన్ పొర రక్షిస్తున్న విశ్లేషణ చిత్రాలను ముగ్గులుగా వేశారు. ముందుగా డయాగ్రామ్‌లను సుద్దతో వేసి అనంతరం రంగు రంగుల ముగ్గులతో డయాగ్రామ్‌లను ఆకర్షణంగా తీర్చిదిద్దారు. తొలుత 6, 7, 8 తరగతి విద్యార్థులకు సైన్స్ డ్రాయింగ్ పోటీలు పెట్టారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీవీ రామన్ జీవిత చరిత్ర, సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు, సైన్స్ బిట్ పరీక్ష నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డి.ప్రసాద్ ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులు సానబోయిన వెంకట శ్రీనివాస్, కుంచే అరుణ జ్యోతి గణిత ఉపాధ్యాయుడు పంతం రామ్మూర్తినాయుడు, వ్యాయామోపాధ్యాయులు రేలంగి రామకృష్ణ, డ్రాయింగ్ టీచర్ అడ్డాల శివరామకృష్ణంరాజు తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. రామన్ ఎఫెక్ట్ కనుగన్న రోజు ఫిబ్రవరి 28 సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం పాఠశాలలో నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని సైన్స్ ఉపాధ్యాయులు వివరించారు.

గొర్రెలకు టీకాలు



లక్ష్మణేశ్వరంలో గొర్రెలకు టీకా వేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: గొర్రెలకు బొబ్బ వ్యాధి సోకకుండా ఉండేందుకు టీకా వేయించాలని పశువైద్యాధికారి ఇంజేటి సురేంద్ర రైతులకు సూచించారు. సోమవారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎన్ కృష్ణసాయి, పశుసంవర్ధకశాఖ సహాయకులు కె.సురేష్, గొర్రెల రైతులు కైల వీర్రాజు, కైల రాముడు, సామకం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

28న పూలపల్లిలో మెగా జాబ్ మేళా

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం, వికాస కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పూలపల్లి గౌతమి డిగ్రీ కళాశాల ఆవరణలో 28న మంగళవారం ఉదయం 9గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ ఏనుగుపల్లి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 20కి పైగా బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరై 1190కి పైగా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

పెనుగొండ: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ జీవీవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్ సమావేశంలో ఆయన విద్యార్థులకు క్రమ శిక్షణ, సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు వైపు ముందుకు సాగాలని సూచించారు. ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ మాట్లాడుతూ జీవితంలో లక్ష్యం ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో నడచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.శశికుమార్, కె.సురేష్, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు



గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

మొగల్తూరు: నరసాపురం – మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం సీతారాంపురం వద్ద ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం జాతీయ రహదారిపై సీతారాంపురం నుంచి నరసాపురం వైపు వెలుతున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో కారు ముందు భాగం నుజునుజ్జు అయింది. ప్రమాదం సమయంలో కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో కారును నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం వీరబాబు తెలిపారు.

రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద లైట్ల ఏర్పాటుకు వినతి

ఉండి: ఉండి రైల్వేస్టేషన్ ముఖద్వారంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ఉండి రైల్వే ప్రయాణికుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మన నాగబాబు, సీహెచ్ బంగార్రావు ఉన్నతాధికారులను కోరినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాత్రి వేళల్లో రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు, రైలు దిగిన బయటకు వచ్చిన ప్రయాణికులు స్టేషన్ ముఖద్వారంలో చీకటి కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై విజయవాడ రైల్వే డివిజినల్ మేనేజర్‌కు ప్రయాణికుల సంఘం తరపున వినతిపత్రాన్ని పంపించామని తెలిపారు. రైల్వే అధికారులు ప్రయాణికుల వినతిని పరిగణనలోకి తీసుకుని స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.